# కమిట్‌మెంట్‌తో పనిచేశా..
# మళ్లీ చేస్తా..



నామినేషన్ వేసిన అనంతరం తనను ఆశీర్వదించేందుకు వచ్చిన ప్రజలతో మాట్లాడుతున్న మంత్రి వేముల

- మరోసారి ఆశీర్వదించండి.. ఐదేండ్లు సేవకుడిలా పనిచేస్తా..
- మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి
- నియోజకవర్గ అభివృద్ధి ఘట్టాలు.. మధుర జ్ఞాపకాలు
- సకల జనులకు వరం.. బీఆర్ఎస్ మ్యానిఫెస్టో
- నామినేషన్ దాఖలు చేసిన వేముల
- భారీగా తరలివచ్చిన ప్రజలు, అభిమానులు



భీమ్‌గల్, నవంబర్ 6: గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను మనుసు పెట్టి పనిచేసి నెరవేర్చానని.. మరోసారి ఆశీర్వదించాలని రాష్ట్ర మంత్రి, బాల్కొండ బీఆర్ఎస్ అభ్యర్థి వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. సోమవారం మంత్రి వేముల భీమ్‌గల్‌లో నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా ప్రశాంత్‌రెడ్డిని ఆశీర్వదిస్తూ నియోజకవర్గ నలుమూలల నుంచి ప్రజలు, అభిమానులు భారీగా తరలివచ్చి ర్యాలీ నిర్వహించారు. ప్రజలనుద్దేశించి ముచ్కూర్ ఎక్స్‌రోడ్డు వద్ద మంత్రి ప్రసంగించారు. ప్రజల కోసం నిబద్ధతతో పనిచేస్తే వారే కడుపులో పెట్టుకొని కాపాడుకుంటారని తాను బలంగా విశ్వసిస్తానన్నారు. తనను ఆశీర్వదించడానికి వేల సంఖ్యలో స్వచ్ఛందంగా తరలివచ్చిన ప్రజలు, అభిమానులే ఇందుకు నిదర్శమని తెలిపారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను, సాగునీటి రంగంలో విజయం సాధించినప్పుడు తనకు కలిగిన ఆనందం వర్ణించలేనిదని ఉద్వేగంగా చెప్పారు. ఈ అభివృద్ధి పనులన్నీ తన జీవితంలో మర్చిపోలేని మధుర ఘట్టాలని అన్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో రూ.2కోట్లతో పునర్జీవ పథకం పూర్తిచేసి వరద కాలువ ద్వారా కాళేశ్వరం జలాలను ఎస్సారెస్పీలో నింపి చూపించామన్నారు. దీంతో గుత్ప, హన్మంత్‌రెడ్డి, నవాబ్ ఎత్తిపోతల పథకాలకు, నియోజకవర్గంలో కొత్తగా 80వేల ఎకరాలకు సాగునీటిని అందించే ప్యాకేజ్ -21 పథకానికి సమృద్ధిగా నీరు లభించేలా చేశామన్నారు. కప్పలవాగు, పెద్దవాగుల్లో 24 చెక్‌డ్యాములను సీఎం కేసీఆర్ సహకారంతో మంజూరు చేయించుకొని 17చెక్‌డ్యాములను పూర్తి చేసుకున్నట్లు తెలిపారు. ఫలితంగా 42కి.మీ పారే ఈ వాగుల వెంట 32గ్రామాలకు సాగునీటి ప్రయోజనం కలిగిందన్నారు. కప్పలవాగులో కాళేశ్వరం జలాలను పారించి సాగునీటికి సరికొత్త భరోసాను అందించామన్నారు. కొత్తగా విద్యుత్ సబ్‌స్టేషన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసుకొని రైతుల కరెంటు కష్టాలను దూరం చేశామన్నారు. భీమ్‌గల్ పట్టణం గతంలో ఎట్లుండే.. ఇప్పుడు ఎలా ఉందో.. అభివృద్ధి ప్రజల కండ్లముందే ఉన్నదన్నారు. రూ.150కోట్లతో సెంట్రల్ లైటింగ్, నాలుగు లైన్ల రోడ్లు , గల్లి గల్లీలో సీసీ రోడ్లు, ప్రధాన మార్గాల్లో బీటీ రోడ్లు వేయించి, అన్నివర్గాల శ్మశాన వాటికలను సౌకర్యవంతంగా తీర్చిదిద్ది, ఇంటిగ్రేటెడ్ వెజ్-నాన్‌వెజ్ మార్కెట్ నిర్మాణం చేపట్టి భీమ్‌గల్ పట్టణాన్ని సర్వతోముఖాభివృద్ధిగా చేసినట్లు వివరించారు. ప్రముఖ పుణ్యక్షేత్రం లింబాద్రి గుట్టకు రూ.3.50కోట్లతో డివైడర్ రోడ్లు, సెంట్రల్ లైటింగ్, గిరి ప్రదక్షిణ రోడ్డు సౌకర్యాలు కల్పించి అభివృద్ధి చేశామన్నారు. ఇవన్నీ తన జీవితంలో మర్చిపోలేని ఘట్టాలని చెప్పారు. ప్రస్తుత ఎన్నికల్లో ఇస్తున్న హామీలను సైతం ఇదే కమిట్‌మెంట్‌తో పనిచేసి నెరవేరుస్తానని అన్నారు. హన్మంత్ రెడ్డి ఎత్తిపోతల పథకానికి స్టీల్ పైప్‌లైన్ వేయిస్తానని, లింబాద్రి గుట్ట క్షేత్రాన్ని ప్రభుత్వ సహకారంతో మరింత అభివృద్ధి చేస్తానని, నియోజకవర్గ కేంద్రమైన బాల్కొండను అక్కడి ప్రజలకు ఇష్టమైతే.. మున్సిపాలిటీగా మార్చి అభివృద్ధి చేస్తానని తెలిపారు. ఈ అంశాలను ఇటీవల వేల్పూర్‌కు వచ్చిన సందర్భంగా సీఎం కేసీఆర్‌కు తాను విన్నవించగా కేసీఆర్ అభయం ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. బీఆర్ఎస్ ఎన్నికల మ్యానిఫెస్టో సకల జనుల సంక్షేమానికి వరంలాగా ఉన్నదన్నారు. కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్ రావు, ఫ్యామిలీ అండ్ హెల్త్ వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ మధుశేఖర్, క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ డి.రాజేశ్వర్, డీసీసీబీ వైస్ చైర్మన్ రమేశ్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ కన్నె ప్రేమలతాసురేందర్, ఎంపీపీ మహేశ్, జడ్పీటీసీ రవి, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

## మాచారెడ్డి జడ్పీటీసీని కలిసిన కేటీఆర్



రాంరెడ్డితో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్

కామారెడ్డి, నవంబర్ 6: మాచారెడ్డి జడ్పీటీసీ మిన్కూరి రాంరెడ్డిని కామారెడ్డి జిల్లా కేంద్రంలోని అశోక్‌నగర్‌లోని ఆయన నివాసంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ సోమవారం కలిశారు. ఈ నెల 9వ తేదీన సీఎం కేసీఆర్ నామినేషన్ దాఖలు, అనంతరం నిర్వహించనున్న భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని సూచించారు. మండలంలోని నాయకులంతా కలిసి సభను విజయవంతం చేయాలని అన్నారు. పార్టీని పటిష్టం చేసేందుకు నాయకులంతా ఏకతాటిపై ఉండాలని అన్నారు. ఆయన వెంట ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్, ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి, సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు ముజీబుద్దీన్, బీఆర్ఎస్ నాయకులు నిట్టు వేణుగోపాల్ రావు, ఎంజీ వేణుగోపాల్ గౌడ్, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## పార్టీలో అందరూ కలిసికట్టుగా పనిచేయాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, పక్కన ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్

- ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి
- ఇద్దరు నాయకుల సస్పెన్షన్

కామారెడ్డి, నవంబర్ 6 : కేసీఆర్‌ను భారీ మెజారిటీతో గెలిపించుకునేందుకు అందరూ కలిసికట్టుగా పని చేయాలని కామారెడ్డి నియోజకవర్గ ఇన్‌చార్జి, సమన్వయ కమిటీ సభ్యుడు ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి అన్నారు. నియోజకవర్గంలో క్రమశిక్షణారాహిత్యానికి పాల్పడిన ఇద్దరు నాయకులను బీఆర్ఎస్ పార్టీ బహిష్కరించినట్లు తెలిపారు. సీఎం కేసీఆర్ పోటీ చేస్తున్న నియోజకవర్గంలో సమన్వయంతో కలిసి మెలిసి పని చేయాలని సూచిస్తున్నప్పటికీ పలువురు పార్టీ వ్యతిరేక కార్యకలాపాలు నిర్వహిస్తున్నందున అధిష్టానం సీరియస్‌గా స్పందిస్తుంది. ఇందులో భాగంగా పార్టీ నియమావళికి విరుద్ధంగా వ్యవహరించిన మాచారెడ్డి వైస్ ఎంపీపీ జీడిపల్లి నర్సింహారెడ్డి, మంథని దేవునిపల్లి సర్పంచ్ అరవింద్‌ను క్రమశిక్షణ చర్యలో భాగంగా బీఆర్ఎస్ పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు ప్రకటించారు. కామారెడ్డి పట్టణంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల జరిగిన మాచారెడ్డి కార్యకర్తల సమావేశంలో చోటు చేసుకున్న సంఘటన క్షణికావేశంలోనే జరిగిందన్నారు. ఇది కుటుంబంలో జరిగిన సంఘటన మాత్రమే అని అన్నారు. ఈ విషయంలో కొందరు చిల్లరగా ఏదో జరిగినట్లు ప్రచారం చేస్తున్నారని అన్నారు. దానిపై వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సైతం విచారం వ్యక్తం చేసి నాయకులతో మాట్లాడారన్నారు. బయట చెప్పినట్లు ఎలాంటి అపోహాలు లేవని అన్నారు. మాచారెడ్డి ఎంపీపీ నర్సింగ్‌రావు మాట్లాడుతూ అందరం కలిసి కట్టుగా పని చేసి మాచారెడ్డి మండలంలో సీఎం కేసీఆర్‌కు భారీ మెజారిటీ వచ్చే విధంగా కృషి చేస్తామన్నారు. విలేకరుల సమావేశంలో విప్ గంపగోవర్ధన్, ఫుడ్ కమిషన్ మాజీ చైర్మన్ తిర్మల్ రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబుద్దీన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నిట్టు వేణుగోపాల్ రావు తదితరులు పాల్గొన్నారు.

